ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 34.0
కనిష్ఠం 23.4
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
ఆదివారం 18 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590 (312.5050)	68,984	69,884
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.38 (3.78)	768.05	564.83
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.34 (44.74)	58,450	57,698

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



నాగార్జున సాగర్ ఆయకట్టు వరి సాగుకు ప్రసిద్ధి. గతంలో సంప్రదాయ వరి పంటలకు నెలవైన ఆయకట్టులో నేడు సన్న రకాల పేరుతో ప్రైవేట్ విత్తనాల సంస్థలు పాగా వేశాయి. వ్యాపారులకు లాభసాటిగా మారిన ఈ రకాల సాగు రైతులకు మాత్రం నష్టాన్ని కలిగించి కన్నీళ్లు పెట్టిస్తున్నాయి.

\- మిర్యాలగూడ(వ్యవసాయం)

ప్రైవేట్ వరి విత్తనాల పాగా

- ఆయకట్టులో 90శాతం అవే సాగు
- తెగుళ్లతో నష్టపోతున్న రైతులు
- మిల్లర్ల ఆసక్తితో తప్పని సాగు

నాగార్జునసాగర్ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రాంతంలో దశాబ్దాలకాలంగా ప్రైవేట్ వరి విత్తనాల సాగు గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 90శాతం మేర వివిధ రకాల ప్రైవేట్ రకాలైన చింట్లు, హెచ్‌ఎంటీ వంటి విత్తనాలు సాగవుతున్నాయి. కేవలం 10శాతం మాత్రమే సంప్రదాయ వరి రకాలు సాగువుతున్నాయి.

సంప్రదాయ వరి విత్తనాలకు స్వస్తి

రాష్ట్రంలో 1980లో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ పరిశోధనా సంస్థ నుంచి విడుదలైన బీపీటీ-5204 (సాంబమసూరి) వరి రకం దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ రకం వరి తెగుళ్లను సమర్థంగా తట్టుకోవడంతో పాటు ఎకరానికి 40-50 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. రైతులకు ఈ రకం సాగు లాభసాటిగా ఉండేది. సన్నగా ఉండటంతో పాటు రుచిగా ఉండేది. మార్కెట్లో మంచి గిరాకీ కూడా పలికేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు ఒడిషా తదితర రాష్ట్రాల్లో ఈ పంట లక్షల ఎకరాల్లో సాగైంది. నాలుగు దశాబ్దాల పాటు ఈ రకానికి వానాకాలం సాగులో తిరుగులేకుండా పోయింది. కాలక్రమేణా వినియోగదారుల అభిరుచుల్లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. చాలా సన్నగా ఉండే రకాలకు మార్కెట్లో డిమాండ్ పెరగడంతో బీపీటీ సాగును రైతులు తగ్గించి ప్రైవేట్ విత్తనాల వైపు మొగ్గుచూపుతున్నారు.

అనివార్యంగా ప్రైవేట్ రకాల సాగు

సాగర్ ఆయకట్టులో అత్యధికంగా పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. ధాన్యం కొనుగోలులో మిల్లర్లదే కీలక పాత్ర. మార్కెట్లో వారు చెప్పిందే వేదం. ప్రైవేట్ వరి వంగడాలు సన్నగా ఉండటంతో ఈ రకాలకు మార్కెట్లో ధర పలుకుతుండటంతో మిల్లర్ల ఈ రకాలను కొనుగోలు చేస్తున్నారు. బీపీటీ వరి రకాలు సాగు చేసినా మిల్లర్లు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. నాలుగేళ్లుగా ప్రైవేట్ రకం ధాన్యాన్ని క్వింటాకు రూ.2,200 చెల్లించిన మిల్లర్లు బీపీటీ ధాన్యానికి కనీసం రూ.1,700 కూడా చెల్లించడం లేదు. చాలా మంది మిల్లర్లు అసలు ఈ రకాలను కొనుగోలు చేయడం లేదు. యాసంగిలో అత్యధికంగా సాగయ్యే ఎంటీయు-1010 వంటి రకాల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు మినహా మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. ఈ రకం ధాన్యాన్ని 17 శాతం తేమ వచ్చేవరకు ఆరబెట్టాల్సి రావడంతో గత్యంతరం లేని పరిస్థితిలో అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోలేని ప్రైవేట్ రకాలను సాగు చేయాల్సి వస్తోందని, దిగుబడులు అంతగా రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ పరిశోధనా కేంద్రాలున్నా

రాష్ట్రంలో ప్రభుత్వరంగ వ్యవసాయ పరిశోధనా సంస్థలు ఉన్నా, ప్రైవేట్‌కు దీటుగా మార్కెట్లో డిమాండ్ ఉన్న అతి సన్న రకం వంగడాలను రూపొందించలేకపోతున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం పరిశోధనా సంస్థ ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం, జేజీఎల్, కేపీఎస్ వంటి వందల రకాల విత్తనాలు రూపొందించింది. ఈ విత్తనాలు చాలా వరకు తెగుళ్లను తట్టుకుంటాయి. ఎకరానికి 40బస్తాలకు పైగా దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. వీటి సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయినా మార్కెట్లో ఈ రకం విత్తనాలు ప్రభావం చూపలేకపోయాయి. గింజ పరిమాణంలో తేడా ఉండటంతో పాటు ప్రైవేట్ రకాల మాదిరిగా పచ్చి ధాన్యం విక్రయానికి అనువుగా లేకపోవడంతో మిల్లర్ల నుంచి ఆదరణ లభించడం లేదు. నాణ్యమైన విత్తనాలు రూపొందించినా, మార్కెట్‌ను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయడం లేదనే విమర్శలూ ఉన్నాయి. వ్యాపారులతో చర్చించి ప్రభుత్వరంగ సంస్థలు రూపొందించిన వంగడాలను కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకుంటే తప్ప ప్రభుత్వ సంస్థ విడుదల చేసిన రకాలను సాగు చేసే పరిస్థితి కనిపించడం లేదనేది రైతుల వాదన.

ప్రైవేట్ వరి రకాలతో నష్టం



గతంలో వానాకాలంలో బీపీటీ, యాసంగిలో ఎంటీ యూ-1010 రకాలను సాగుచేశా. మంచి దిగుబడులు వచ్చేవి. ఐదేళ్ల నుంచి ఆ రకం ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ప్రైవేట్ రకాలకు మార్కెట్లో డిమాండ్ ఉండటంతో వాటినే సాగు చేస్తున్నా. తెగుళ్లు వ్యాప్తి అధికంగా ఉంది. దిగుబడులు ఎకరానికి 20-30 బస్తాలు మించి రావడం లేదు. గింజ మరీ సన్నగా ఉండటంతో బరువు తూగడం లేదు. యాసంగిలో అయితే తాలు అధికంగా వస్తోంది. ఒక్కోసారి పెట్టుబడులు రాక నష్టపోతున్నాం.

\- ఉగ్గిడి అంజనేయులు, రైతు, త్రిపురారం

ఈ రకాలతో నష్టమే

మార్కెట్‌ను అనుసరించి ఆయకట్టులో పంటల సాగు సరళిలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇదే అదునుగా ప్రైవేట్ విత్తన కంపెనీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. విత్తనాలకు డిమాండ్ బాగా ఉండటంతో ధరలు భారీగా పెంచారు. కేవలం 10కిలోల విత్తన ధర రూ.1,000 నుంచి రూ.1,100 వరకు విక్రయిస్తున్నారు. ఎకరం వరి నాటుకు 15 నుంచి 20కిలోల వరకు విత్తనం అవసరం కాగా, రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఖర్చు వస్తోంది. వరి నారు పోసిన మొదలు నాటు వరకు అగ్గి తెగులుతో పాటు మొగిపురుగు, ఆకుచుట్టు పురుగు, కాండం కుళ్లు, పాము పొడ, మెడ విరుపు, వరి కర్ర సన్నగా ఉండటంతో దోమ వ్యాప్తి అధికంగా ఉంటోంది. రసాయనిక ఎరువులతో పాటు పురుగు మందులు అధికంగా పిచికారీ చేయడం వల్ల పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. సంప్రదాయ వరి రకాల సాగుకు ఎకరానికి రూ.20,000 నుంచి రూ.25,000 వరకు పెట్టుబడులు అవుతుండగా, ప్రైవేట్ రకాలకు రూ.30,000 నుంచి రూ.40,000 వరకు ఖర్చు వస్తోంది. అయినా తెగుళ్ల నియంత్రణలోకి రాకపోవడంతో ఎకరానికి 20-30 బస్తాల దిగుబడి రావడం కష్టంగా మారింది. దీంతో కనీసం పెట్టిన పెట్టుబడులు రాక రైతులు భారీగా నష్టపోతున్నారు. మిల్లర్లకు కాసులు కురిపిస్తున్న ప్రైవేట్ వరి వంగడాలు రైతులను అగాధంలోకి నెడుతున్నాయి. ఈ విత్తనాలు వాతావరణ మార్పులకు తట్టుకోలేకపోవడంతో పాటు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటమే కారణమని వ్యవసాయశాఖ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అర్హులందరికీ రుణమాఫీ కోసం స్పెషల్ డ్రైవ్

- ఉమ్మడి జిల్లాకు మరో ఐదు కొత్త బ్రాంచ్‌లు
- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 17: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రుణమాఫీపై సొసైటీ చైర్మన్లు, సీఈవోలు, ఇతర అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలువురు రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆగస్టు 15లోగా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసిందని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 36 బ్రాంచ్‌ల పరిధిలో మొత్తం 89,888 మందికి సంబంధించిన రుణమాఫీకి రూ.499.98కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీగా రూ.279.76కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయన్నారు. మిగతా రుణమాఫీ సొమ్ము సాంకేతిక కారణాలతో నిలిచినందున వారం రోజుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అందరి రుణాలు జమచేస్తామన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాల నెంబర్లు తప్పుగా ఉండటంతో రుణమాఫీ నిలిచిందన్నారు. ప్రతీ రైతుకు న్యాయం చేసేందుకు తమ పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా రైతులు అధికారులను కలిసి వారి ఖాతా నెంబర్లు, ఆధార్ కార్డులను సరిచూసుకొని రుణమాఫీ పొందాలన్నారు. ప్రతీ సహకార బ్యాంకులో అధికారులు, ప్రజా ప్రతినిధులు రుణమాఫీ కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కొత్త మరో ఐదు బ్రాంచ్‌లు వచ్చాయని, మరో ఆరు బ్రాంచ్‌లకు ప్రతిపాదనలు పంపామన్నారు. కొత్తగా తిప్పర్తి, ఆత్మకూర్(ఎం), సంస్థాన్‌నారాయణపురం, గరిడేపల్లి, దామరచర్ల బ్రాంచ్‌లు ఏర్పాటవుతాయన్నారు. కొత్తగా టెస్కాబ్ నుంచి రూ.90కోట్ల రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. ఎల్‌టీ లోన్‌లకు పరిమితి అనేది లేకుండా రుణాలు ఇస్తామన్నారు. విదేశీ విద్య కోసం ఎకరానికి రూ.5లక్షల చొప్పున రూ.35లక్షల రుణాన్ని అందిస్తామన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకును తీర్చిదిద్దడమే గాక, రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కొనసాగుతున్న వాహనాల రద్దీ



చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 17: వరుస సెలవులు, రాఖీ పర్వదినం సందర్భంగా హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల వాహనాలతో జాతీయ రహదారి 65పై శనివారం రద్దీ కొనసాగింది. ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు శని, ఆది, సోమవారం వరసగా మూడు రోజులు సెలవులు ఉండడంతో ఏపీ రాష్ట్ర ప్రజలు సొంత ఊరికి పయనమయ్యారు. వీరితో పాటుగా ఇతర వర్గాల ప్రజలు సైతం హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు బయల్దేరారు. దీంతో జాతీయ రహదారిపై నాలుగైదు వరుసల్లో వాహనాలు వెళ్తుండటంతో అక్కడక్కడ ట్రాఫిక్‌జాం ఏర్పడింది. హైవే వెంట ఉన్న హోటళ్లు వినియోగదారులతో కిక్కిరిశాయి. పట్టణంలోని జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌జాం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.

బీసీ గణనను వెంటనే నిర్వహించాలి

సీఎంకు మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ లేఖ


మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

యాదాద్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : బీసీల కులగణనపై ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే చేపట్టాలని శనివారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బీసీలను ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నారని, అధికారానికి, అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, బీసీల విషయానికొస్తే రాష్ట్రానికో రకంగా ఉన్నాయన్నారు. మండల్ కమిషన్ అంచనా ప్రకారం దేశంలో బీసీలు 52 శాతం ఉంటే వారికి 27శాతం రిజర్వేషన్ ఉందని పేర్కొన్నారు. చట్టసభల్లోనూ ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్ కల్పించి, బీసీలకు కల్పించలేదన్నారు. జనాభాకు తగ్గట్టుగా ప్రాతినిధ్యం ఉండాలని, తెలంగాణాలో బీసీలు 60శాతం ఉన్నారని, 2022లో ఉదయ్‌పూర్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ కులగణనకు అనుకూలంగా నిర్ణయం తీసుకుందన్నారు. భారత్‌జోడో యాత్రలోనూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పదేపదే చెప్పారు, కామారెడ్డి సభలోనూ బీసీ డిక్లరేషన్ ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర కులగణన చేపట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీల వాటా ఎంతో తేల్చాలని కోరుతున్నట్టు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఇచ్చిన హామీని అమలుచేయకుండా కాలయాపన చేస్తున్నారని, బీసీ డిక్లరేషన్ పేరుతో ఓట్లు దండుకుని కులగణన జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, తద్వారా బీసీలు అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందన్నారు. బీసీల సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ.20వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తానని, ఈ బడ్జెట్‌లో కేవలం రూ.9200కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌కి చట్టబద్ధత కల్పించాలని, ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కాలయాపన చేస్తే ఏ బీసీలైతే కాంగ్రె‌స్‌ను అధికారంలోకి తీసుకువచ్చిందో, వారే మిమ్మల్ని గద్దె దింపుతారని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం బీసీ హక్కులను వారికి కల్పించాలని పేర్కొన్నారు.

రోడ్డెక్కిన వైద్యులు, నిలిచిన సేవలు


భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది


ఏరియా ఆస్పత్రిలో నిలిచిన సేవలు

భువనగిరి రూరల్, ఆగస్టు 17 : పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారానికి నిరసనగా దేశవ్యాప్త ఓపీ సేవల బంద్‌లో భాగంగా జిల్లా కేంద్రంలో ఐఎంఏ, ప్రభుత్వ, గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం వైద్యులు రోడ్డెక్కారు. స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో విధులను బహిష్కరించి సేవలను నిలిపివేసి ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి జగదేవ్‌పూర్ చౌరస్తా మీదుగా ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాస్తారోకో చేపట్టారు. దీంతో 30 నిమిషాల పాటు రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అత్యవసర సేవలు మాత్రమే సాగాయని డీసీహెచ్‌వో డాక్టర్ చిన్నానాయక్ తెలిపారు. కాగా ప్రైవేట్ ఆస్పత్రులన్నీ మూతపడ్డాయి. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ భార్గవ్, వైద్యులు అజయ్‌కుమార్, ఎడ్ల అనిల్‌రెడ్డి, సుమంత్, కేఎల్ఎన్.ప్రసాద్, ప్రశాంతి, ఇందిర, గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు కొండ సోమయ్య, నర్సింహయాదవ్, నర్సింహారెడ్డి, రఘునందన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో..

బీబీనగర్ : కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచార ఘటనపై బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు, వైద్యవిద్యార్థులు గళమెత్తారు. విధులు, సేవలను నిలుపుదల చేసి ఎయిమ్స్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. అనంతరం ఎయిమ్స్ ప్రాంగణం నుంచి జాతీయ రహదారి మీదుగా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ర్యాలీ నిర్వహించారు. బీబీనగర్ పట్టణంలోని ప్రధానకూడలి పోచంపల్లి చౌరస్తాలో రహదారిని దిగ్బంధించి వైద్యవిద్యార్థులు గంటకు పైగా ధర్నా కొనసాగించారు. వైద్యులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నుంచి రక్షణ కల్పించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని నినదించారు. వైద్యులపై నిత్యకృత్యంగా మారిన దాడులు, హత్యలు, అత్యాచారాలకు పాల్పడే వారిపై శిక్షలు కఠినంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో వైద్యుల పై జరుగుతున్న దాడులు, అత్యాచారాలపై ఈ సందర్భంగా డెమో ప్రదర్శించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ హనుమంతు కే జెండగే


పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

వలిగొండ, ఆగస్టు 17 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతు కే జెండగే అధికారులను సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నిరకాల వ్యాధులకు సంబంధించిన రాపిడ్ కిట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పారిశుధ్య పనులు సమర్థంగా నిర్వహించాలని, దోమల వ్యాప్తి నివారణకు అన్నిచర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ పీహెచ్‌సీకి వస్తున్న ఔట్‌పేషంట్ల వివరాలు, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షల వివరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులను ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ స్వామి, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి ఉన్నారు.

సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై చర్యలు


బీబీనగర్ పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

బీబీనగర్, ఆగస్టు 17 : సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ హెచ్చరించారు. శనివారం బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆ సమయంలో పూర్తి స్థాయి వైద్య సిబ్బంది విధుల్లో లేకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రిజిష్టర్‌లో విధులకు హాజరైనట్లు సంతకాలు పెట్టి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృత్తి నైపుణ్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

చేనేత, జౌళిశాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ వెంకటేష్


భూదాన్‌పోచంపల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ఏడీ వెంకటేష్

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 17 : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ వృత్తి నైపుణ్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ అదనపు డైరెక్టర్ వెంకటేష్ కోరారు. శనివారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలో జిల్లా చేనేత,జౌళి శాఖ ఏడీ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ భవనంలో ఆయా కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఈ కోర్సు ద్వారా చేనేత కళాకారులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. చేనేత,జౌళి రంగాల్లో సాంకేతిక శిక్షణ ద్వారా వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడంతో పాటు సాంప్రదాయ వృత్తిలో కొనసాగుతున్న చేనేత కళాకారులకు ఉపాధి అవకాశాలు పెంపొందుతాయన్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితి కలిగిన ఈ కోర్సులో చేరడానికి కనీసం అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలన్నారు. ఈ కోర్సు ద్వారా 60 మంది విద్యార్థులకు హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు యూనివర్సిటీలో శిక్షణను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నిఏర్పాట్లు సిద్ధం చేసిందన్నారు. ఈ కోర్సుల్లో చేరిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.5వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 2500 ఉపకార వేతనం ప్రతి నెలా అందిస్తాయన్నారు. సదస్సులో ప్రధాన కార్యాలయం సంచాలకులు ఎండీ కామిల్, చేనేత నాయకులు ఎన్నం శివకుమార్, గంజి బస్వలింగం, దుద్యాల పాపయ్య, గంజి కృష్ణ, కర్నాటి పురుషోత్తం పాల్గొన్నారు.

గర్భిణులకు, శిశువులకు వ్యాక్సిన్ అందించాలి


పగిడిపల్లి పీహెచ్‌సీలో వ్యాక్సిన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ రామకృష్ణారావు

భువనగిరి రూరల్, ఆగస్టు 17 : పుట్టిన ప్రతీ బిడ్డకు, గర్భిణులకు తప్పనిసరిగా టీడీ వ్యాక్సిన్‌ను రెండు మోతాదుల్లో ఇవ్వాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ రామకృష్ణారావు సూచించారు. విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని భువనగిరి శివారులోని పగిడిపల్లిలో శనివారం నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. పుట్టిన చిన్నారులకు తల్లిపాలు పట్టించాలని, బాలింతలు సరైన పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని అనంతారం పల్లె దవాఖానాను సందర్శించారు. కార్యక్రమంలో వైద్యులు కొండ మురళి, సురేశ్‌కుమార్, రమాదేవి, జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ వీరేంద్ర కుమార్, కృష్ణ, మాధవి, నర్సమ్మ, కల్పన, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఉన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనపై దృష్టి సారించాలి


తుక్కాపురంలో కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న సీఈవో శోభారాణి

భువనగిరి రూరల్, ఆగస్టు 17 : గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈవో ఎన్ శోభారాణి సూచించారు. శనివారం భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో కంపోస్టు యార్డు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలో మొక్కలపెంపకాన్ని ఆయన పరిశీలించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులకు అందించేలా కృషి చేయాలన్నారు. ఇంటింటికీ మొక్కల పెంపకం తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిల్కూరి శ్రీనివాస్, ఎంపీవో మొరిగాడి దినకర్, పంచాయతీ కార్యదర్శి మునగాల శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాతసేవలో మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభులను సువర్ణ ప్రతిమూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలను అభిషేకించి తులసి దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్యకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో అత్యంత వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపలంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు.



సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామఅంగేశ్వరస్వామికి మహామండపలంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. కాగా ధార్మిక సాహిత్య సంగీత సభల్లో భాగంగా పరవీణ మ్యూజిక్ అకాడమి శ్రీమతి శాంతి చంద్రిక బృందం వారితో భక్తి సంగీతం, హైదరాబాద్ జేఎస్ డ్యాన్స్ అకాడమీ శ్రీఖర్ మాస్టర్ బృందం కూచిపుడి నృతం కార్యక్రమాలను నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ ఆర్.ముత్యాలరాజు కుటుంబ సమేతంగా, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్ స్వామి వారిని వేర్వేరుగా దర్శించుకున్నారు.

మూసీలో గుర్తు తెలియని మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కేతేపల్లి, ఆగస్టు 17: మూసీ నదిలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామ శివారులోని మూసీనదిలో 60 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి ఆచూకీ కోసం పరిసర మండలాలు, గ్రామాలకు చెందిన వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారాన్ని వైరల్ చేసినా మృతుడి వివరాలు లభించలేదని ఎస్ఐ శివతేజ తెలిపారు. మృతుడి ఒంటిపై గ్రే కలర్ టీ షర్టు, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆనవాళ్లు తెలిసిన వారు 872670180కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. మృతదేహాన్ని నకిరేకల్ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపచినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కేతేపల్లి, ఆగస్టు 17: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇనుపాములలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శివతేజ తెలిపిన మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. నకిరేకల్ మండలం మండలాపురం గ్రామానికి చెందిన తీగల దిలీప్ (22) జాతీయ రహదారిపై కాలినడకన సూర్యాపేట వైపునకు వెళ్తుండగా ఇనుపాముల గ్రామ శివారులోని వెనక నుంచి గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దిలీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. దిలీప్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నకిరేకల్ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. దిలీప్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సాగర్ రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల


నాగార్జునసాగర్ రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్,ఆగస్టు 17: నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండు క్రస్ట్‌గేట్లను ఏడు అడుగుల మేరకు ఎత్తి 22,400క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590(312.0450టీఎంసీలు)అడుగులు కాగా ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉంది. ఎగువన శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు(215.8070టీఎంసీలు) కాగా ఆ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 92,234 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 881.20 అడుగులుగా(194.7599టీఎంసీలుగా) నీరు నిల్వ ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాలల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 68,984 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో సాగర్ నీటి మట్టం ప్రస్తుతం 590 అడుగులుగా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8,375 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 7518 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,191 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, రెండు క్రస్ట్‌గేట్లను ద్వారా 22,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 69,884 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 68,984 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

పులిచింతల రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

మేళ్లచెర్వు: ఉభయ రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లను 2.5 మీటర్లు ఎత్తు 41,698 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 174.34(44.74 టీఎంసీలుగా) అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 58,450 క్యూసెక్కులు వస్తుండగా, తెలంగాణ జెన్‌కో విద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు ఔట్‌ఫ్లో 57,698 క్యూసెక్కులుగా నమోదైంది.

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ జంటనగరాలతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల తో కొద్దిరోజులుగా వరద నీరు దిగువన మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రానికి 662.03క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగి 768.05 క్యూసెక్కులుగా నమోదైంది. 645(4.46టీఎంసీల)అడుగుల నీటిమట్టం కలిగిన ప్రాజెక్టులో ప్రస్తుతం 642.38 (3.78టీఎంసీల) అడుగులుగా నీటిమట్టం ఉంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడికాల్వకు 305.95క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 258.88క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

▸▸ దొంగను పట్టుకున్న స్థానికులు ▸▸ విచారిస్తున్న పోలీసులు

సూర్యాపేట క్రైం, ఆగస్టు 17 : మహిళ మెడలోంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. బాధితురాలు చంద్రకళ, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేటలోని 60 అడుగుల రోడ్డు వద్ద అదే ప్రాంతానికి చెందిన చంద్రకళ అనే మహిళ పనినిమిత్తం నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో ఓ యువకుడు ఆమె మెడలోని సుమారు రెండు తులాలకు పైగా ఉన్న బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. అప్రమత్తమైన మహిళ దొంగ, దొంగ అని కేకలు వేసింది. గమనించి స్పందించిన స్థానికులు కొందరు పారిపోతున్న దొంగను పట్టుకున్నారు. అదేవిధంగా అతడి వద్ద నుంచి అపహరించిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. గొలుసును గట్టిగా లాగడంతో మహిళ చెవికి స్వల్ప గాయమైంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీసీఎస్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొంగను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. చోరీకి పాల్పడిన యువకుడిది ఖమ్మం జిల్లా కేంద్రం కాగా అతడు ప్రేమ వివాహం చేసుకుని ఆర్థికఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాక బీఈడీ విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం రాక ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. పోలీసులు మాత్రం తమదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

గొర్రెల దొంగల పట్టివేత

చిట్యాల: గొర్రెల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్ఐ ధర్మా తెలిపారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 16న మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో ఎనిమిది మంది వ్యక్తులు ఒక ట్రాలీ ఆటో, రెండు కార్లు, ఒక బైక్‌పై తిరుగుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లారు. పోలీసులను చూసి అనుమానితులు పారిపోతుండగా వారిలో ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. విచారణలో ఒకరు కేతేపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన గొరారపు వీరబాబు, మరొకరు త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన నీరకంటి రాజశేఖర్‌గా గుర్తించారు. వీరంతా ఏడు నెలలుగా ఒక ముఠాగా ఏర్పడి చిట్యాల, చౌటుప్పల్, భువనగిరి, ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో గొర్రెలను దొంగిలిస్తున్నట్లు తేలిందన్నారు. వీరి నుంచి ట్రాలీ ఆటో, రెండు కార్లు, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రె పొట్టేలు మృతి

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 17: విద్యుదాఘాతంతో గొర్రె పొట్టేలు మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలకేంద్రంలోని దుగ్యాల ఆదర్శ పాఠశాల సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు, బాధితురాలు కట్టబోయిన పార్వతమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజువారీ లాగే పార్వతమ్మ తన గొర్రెలను మేపేందుకు తీసుకెళ్తుండగా స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద నీరు ఉండడంతో ఆ గొర్రెలు నీళ్లు తాగడానికి వెళ్లాయి. అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్ తగిలి గొర్రె పొట్టేలు అక్కడికక్కడే మృతి చెందింది. పొట్టేలు రూ.30వేల విలువ ఉంటుందని బాధితురాలి తెలిపింది. విద్యుత్ అధికారుల ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ వేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఆదర్శ పాఠశాల ఉంటుందని, ఒక వేళ విద్యార్థులు ఆడుకోవడానికి వెళితే పెనుప్రమాదం సంభవిస్తుందని, అధికారులు వెంటనే ఫెన్సింగ్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

రేషన్ దుకాణాల్లో దాడులు

చింతపల్లి, ఆగస్టు 17: దేవరకొండ, పెద్దవూర డీటీఎస్ అధికారులు శ్రీనివాస్ ముక్తార్ ఆధ్వర్యంలో చింతపల్లి మండలంలో పలు రేషన్ దుకాణాల్లో శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని వర్కాల, ఘడియాగౌరారం, నసర్లపల్లిలోని రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ప్రతీ నెలా రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలని సూచించారు. సమయపాలన పాటించి ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా అర్హులకు పారదర్శకంగా రేషన్ సరుకులు అందించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆర్ఐసీఎస్ సైదులు పాల్గొన్నారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

డిండి: మండలంలోని కాల్వతండా వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... డిండి మండలం కాల్వతండా నుంచి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. కాల్వ తండా వద్ద ఆరు క్వింటాళ్లను బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఎండి.రియాజ్, మంజురుస్సేన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో చిన్నారి మృతి బాధాకరం


పావని తల్లిదండ్రులను పరామర్శిస్తున్న మాజీమంత్రి జగదీ‌శ్‌రెడ్డి

● మాజీమంత్రి గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డి

నాగారం, ఆగస్టు 17: తల్లిదండ్రులపై జరుగుతున్న దాడిని అడ్డుకోబోయి తోపులాటలో కిందపడి చిన్నారి కాసం పావని మృతిచెందడం బాధాకరమని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్‌కుమార్, రమావత్ రవీంద్రకుమార్‌లతో కలిసి పావని తల్లిదండ్రులను శనివారం పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల క్రితం జరిగిన చిన్న గొడవను మనస్సులో ఉంచుకొని ప్రత్యర్థులు రాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి కాసం సోమయ్య, అతని భార్య మంజులను గాయపరిచారన్నారు. తల్లిదండ్రులపై దాడి చేస్తున్నారని గమనించి అడ్డుపడిన సోమయ్య-మంజుల దంపతుల చిన్న కూతురు పావని మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పావని కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు లేకుండాపోయాయన్నారు. పావని చిత్రపటానికి పూలమాలవు వేసి నివాళులర్పించారు.

నిందితుల అరెస్టు

ఈ నెల 15 తేదీన కాసం సోమయ్య, అతడి భార్య మంజులపై దాడి చేసి వారి కుమార్తె పావని మృతికి కారకులైన కడారి సైదులు, కడారి సోమయ్య, కాసం కళింగంపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్ఐ ఐలయ్య తెలిపారు. అరెస్టు చేసిన వారిని తుంగతుర్తి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచామని, జడ్జి ఆదేశం మేరకు నిందితులను సూర్యాపేట జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు. పావని అంత్యక్రియలు శుక్రవారం రాత్రి ఏడు గంటలకు పూర్తయ్యాయి. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతరు కళ్లముందే చనిపోవడంతో గుండెలవిసేలా విలపించారు. గ్రామంలో అవాంచనీయ సంఘటనలు జరగకూండా నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుక్కల దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

ఆత్మకూర్(ఎస్)ఆగస్టు 17: బజారుకు వెళ్లిన బాలికపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం బొప్పారం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొప్పారం గ్రామానికి చెందిన చెక్కల వీరభద్రం కుమార్తె మేఘన శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. వీధిలో ఉన్న నాలుగుకుక్కలు బాలికపై దాడి చేశాయి. బాలిక అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చి కుక్కలను అక్కడి నుంచి తరిమేశారు. అప్పటికే బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో బాలికను తండ్రి వీరభద్రం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స చేయించారు. ఐదు నెలల నుంచి కుక్కలు గ్రామంలో ఆరుగురిపై దాడి చేసి గాయపర్చాయని గ్రామస్థులు తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ప్రాజెక్టులతోనే ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

● నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి

మర్రిగూడ, ఆగస్టు 17: నల్లగొండ జిల్లా ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం డిండి, శివన్నగూడ ప్రాజెక్టులతోనే సాధ్యమవుతుందని నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా మిషన్ భగీరథ ద్వారా కృష్ణానది జలాలను తాగిన తర్వాత ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య స్థితిగతులను ఫ్లోరోసిస్ సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు దంత ఫ్లోరోసిస్ వచ్చిందేమోనని దంతాలను పరిశీలించారు. డిండి ఎత్తిపోతల ద్వారా స్వర్ణగూడెంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి కన్వీనర్ కంచుకట్ల సుభాష్ వివరించారు. ప్రాజెక్టు పనులు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన నిర్వహిస్తే ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, నాయకులు మహేశ్వరం సతీష్, గొట్టిముక్కుల ప్రకాష్, మాస బాలరాజు, శ్రీనివాస్, కృష్ణమూర్తి, వెంకటంపేట బాలయ్య, వెలమినేటి సత్తిరెడ్డి, సురిగి యాదయ్య, వంగూరి సంజీవయ్య, పురుషోత్తం వెంకటేశ్వర్లు, లింగయ్య, శ్రీనివాస్, హరికృష్ణ, కోమల్ సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల దంతాలను పరిశీలిస్తున్న రాజారెడ్డి

పిల్లల మనసును నిర్బంధించొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎంఏ.కరీం

భువనగిరి రూరల్, ఆగస్టు 17: చదువుల పేరిట పిల్లల మనసును నిర్బంధించవద్దని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంఏ.కరీం అన్నారు. శనివారం భువనగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల మానసిక స్థిరత్వాన్ని పెంచేందుకు జ్ఞాపక శక్తి, ఏకాగ్రతతో పాటు వారిలో సామాజిక విజ్ఞానం, వినోదం కోసం చేపట్టే పలు అంశాలపై ప్రసంగించారు. పిల్లలు చదువుల్లో బాగా రాణించాలంటే వారి ఏకాగ్రత ఇతర వ్యాపకాలపై వెళ్లకుండా దృష్టిని కేంద్రీకరించాలని, చదువుల పేరిట వారిని మానసిక సంఘర్షణలకు గురి చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్ రామకృష్ణ, వివిధ ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు సురేశ్, సుధీర్, శ్రీకాంత్, కృష్ణ, జిట్టా దనాప్‌రెడ్డి ఉన్నారు.

రహీంఖాన్‌పేట స్టేజీ వద్ద బస్సులు ఆపాలి



ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 17: మండలంలోని రహీంఖాన్‌పేట స్టేజీ వద్ద అన్ని డిపోల బస్సులు ఆపాలని సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కూరెళ్ల, పోతిరెడ్డిపల్లి, తుక్కాపురం గ్రామాల ప్రజలు, విద్యార్థులు బస్సు ప్రయాణం చేయాలంటే రహీంఖాన్‌పేట బస్‌స్టేజీవద్దకు వస్తారు కానీ, ఈ స్టేజీ వద్ద బస్సులు ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోత్కూరు -రాయగిరి రోడ్డుపై తిరుగుతున్న వివిధ డిపోలకు చెందిన బస్సులు కేవలం రెండు స్టేజీల్లో మాత్రమే బస్సులు ఆపుతున్నారని , మిగిలిన గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, సూపర్‌డీలక్స్ బస్సులను ఆపకుండా వెళ్లడంతో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే డిపో మేనేజర్లతో మాట్లాడి ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మండలంలో అసంపూర్తిగా మిగిలిపోయిన బునాదిగాని కాల్వ పనులను తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పల ముత్యాలు, సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, జల్ది రాములు, ఎం.అంజయ్య, కె.నర్సయ్య, ఎండీ.నయీమ్ పాల్గొన్నారు.

గృహ జ్యోతికి దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరి రూరల్, ఆగస్టు 17: అభయ హస్తం ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహ జ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని భువనగిరి మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజులరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గతంలో దరఖాస్తు పెట్టని అర్హులైన వారికి ఉచిత విద్యుత్ లబ్ధి కోసం మునిసిపల్ కార్యాలయ పని దినంలో ప్రత్యేక కౌంటర్‌లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మోత్కూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం గతంలో నిర్వహించిన ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తుల్లో ఉచిత కరెంటు (గృహజ్యోతి) కావాలని కోరని వారికి ఇప్పుడు తిరిగి పొందే అవకాశం ప్రభుత్వం ఇచ్చిందని ఎంపీడీవో పి.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇచ్చిందని, అర్హులై ఉండి ఉచిత కరెంటు పథకం అందని వారు మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తును సవరించుకోవచ్చన్నారు. అప్పుడు దరఖాస్తు చేసుకుని, ఉచిత కరెంటు పథకం అడగని వారికి మాత్రమే ఈ అవకాశం కల్పించారన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు రశీదు, కరెంటు బిల్, ప్రజాపాలన దరఖాస్తు ఫోన్ నంబరు తీసుకుని కార్యాలయానికి రావాలన్నారు.

మెయిన్‌రోడ్డు వెడల్పు 80అడుగులు ఉండాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మోత్కూరు, ఆగస్టు 17: మోత్కూరు మునిసిపాలిటీలోని మెయిన్‌రోడ్డు వెడల్పు 80 అడుగులు, డివైడర్ నుంచి 40 అడుగుల వెడల్పు ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శనివారం మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డు మధ్య నుంచి 40 అడుగుల వెడల్పు ఉండాల్సి ఉండగా కొందరు తగ్గించి తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. మునిసిపల్ సిబ్బంది చేత రోడ్డు మధ్య నుంచి ఉన్న దూరాన్ని కొలిచి 40అడుగుల వెడల్పు ఉండేలా చూడాలన్నారు. వ్యాపారులు తమ దుకాణాల ముందు 40 అడుగుల లోపు ఎలాంటి సామాన్లు పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య, ప్రధాన కార్యదర్శి చేకూరి మల్లేషం, ఎడ్ల రాము పాల్గొన్నారు.

దర్పణాల చోరీ



స్తంభం నుంచి దొంగిలించిన పెద్ద దర్పణం

సంస్థాన్‌నారాయణపురం, ఆగస్టు 17: ప్రమాదాల నివారణ కోసం మూలమలుపుల వద్ద ఏర్పాటు చేసిన దర్పణాలను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి అపహరించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలంలో మూలమలుపులు ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించేందుకు మండల కేంద్రంలోని గుడిగుట్ట శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్తంభాలు ఏర్పాటు చేసి పెద్ద దర్పణాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో స్తంభాలకు ఏర్పాటు చేసిన అద్దాలను దుండగులు అపహరించారు. ప్రజా సంక్షేమాన్ని ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన దర్పణాలను చోరీకి గురవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 17: కలకత్తాలోని మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని చౌటుప్పల్ సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరిండెంట్ కె.అలివేలు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఓపీ సేవలు నిలిపివేతలో భాగంగా చౌటుప్పల్‌లోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో శనివారం ఓపీ వైద్య సేవలను నిలిపివేశారు. అనంతరం సీహెచ్‌సీ ఎదుట



చౌటుప్పల్: గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

నల్లా బ్యాడ్జీలు ధరించి వైద్యులు, సిబ్బంది ధర్నా నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కొవ్వొత్తులను వెలిగించారు. ఈ సందర్భంగా అలివేలు మాట్లాడుతూ రోగులకు 24 గంటలు వైద్య సేవలను అందిస్తున్న వైద్యులు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలని ఆమె కోరారు. ప్రభుత్వ వైద్యులు రాజశేఖర్, సతీష్ పాల్గొన్నారు. పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులను మూసి వేసి మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ సేవలను నిలిపి వేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇద్దరు గర్భిణులు ప్రసవాల కోసం వచ్చి వెనదిరిగి వెళ్లి పోవలసి వచ్చింది. ఆది, సోమవారాలు మూడు ఆసుపత్రులకు సెలవు ఉండడంతో బయటి రోగుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

మోత్కూరు : మోత్కూరులోని ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిపివేశారు. హత్యకు గురైన జూనియర్ డాక్టర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ కోక భిక్షం, మోత్కూరు మండల అధ్యక్షుడు గనగాని నర్సింహ మాట్లాడుతూ నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి పురుగుల రమేష్, కట్టెకోల యుగంధర్, డాక్టర్ ఎడ్ల యాదగిరి రెడ్డి, ఎల్.రఘువర్ధన్, మధు, సైదులు, పాండరి, దశరథ పాల్గొన్నారు.

రామన్నపేట: పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ స్టాఫ్ నర్సులు రాణి, సుశీల, కవిత, శషాజియా, సబిత, పద్మ సిబ్బంది రచిత, వెంకటేశ్, సత్యనారాయణ, నిర్మల, రామలింగం, రాజు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లిలో మండల ఫస్ట్ ఎయిడ్ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్, మండల కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఫస్ట్ ఎయిడ్ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరపల్లి ప్రమోద్, ఉపాధ్యక్షులు గుండు అశోక్, కోశాధికారి సీత భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.బాలరాజు, మండల నాయకులు ఎఎస్.నాయుడు, బి.నరేష్‌కుమార్, కె.మహేష్‌కుమార్, జి.ఋషి, ఏలె హరిశంకర్, గుండు నవీన్‌కుమార్, బాలు, జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేష్, మండల అధ్యక్షుడు అమృతం అశోక్, గౌరవ సలహాదారులు ఎస్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, సభ్యులు ఏ.శంకర్, బి.రవి, ఆర్.ప్రభాకర్, జి.మహేశ్వరి, బి.సామ్రాట్, వనం నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



పోచంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు



చౌటుప్పల్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



బీబీనగర్: ఎయిమ్స్ ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, విద్యార్థులు

అడ్డగూడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆస్పత్రి సిబ్బందితో ప్రకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల వైద్యధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తరచూ వైద్య సిబ్బంది భద్రతకు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.



మోత్కూరులో జూనియర్ డాక్టర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామీణ వైద్యులు



రామన్నపేట ఏరియా ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



అడ్డగూడూరులో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

కాలుష్య బాధిత రైతులను ఆదుకోవాలి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 17: పరిశ్రల కాలుష్యంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ డిమాండ్ చేశారు. శనివారం చౌటుప్పల్ మండలం ఆరెగూడెం సమీపంలో పరిశ్రమల కాలుష్యంతో ఎండిపోయిన పంటపొలాలను జహంగీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ దివీస్ పరిశ్రమ కాలుష్యంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని, ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల కాలుష్యంతో ఈ ప్రాంతం నో మ్యాన్ జోన్‌గా ప్రకటించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యంతో ఈ ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతుంటే పీసీబీ అధికారుల పట్టించుకోకపోవడం శోచనియమన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పరిశ్రమల కాలుష్యం గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పరిశ్రమల కాలుష్యం గురించి ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రజాదర్బార్ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, నాయకుకలు గడం వెంకటేష్, చీరిక సంజీవరెడ్డి, పల్లె మదుకృష్ణ, బోశీ యాదయ్య, అనంత రాములు, గండెబోయిన బాలకృష్ణ, సబిత, బక్కయ్య పాల్గొన్నారు.



ఆరెగూడెంలో పంట పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బునాదిగాని కాల్వ పూర్తికి ప్రజా ఉద్యమం

మోత్కూరు : బునాదిగాని (ధర్మారం) కాల్వ నిర్మాణం పూర్తి కోసం త్వరలోనే ప్రజా ఉద్యమం చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. మోత్కూరు యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన మోత్కూరు, గుండాల మండలాల సీపీఎం కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కాల్వ నిర్మాణం ప్రారంభించి రెండ దశాబ్దాలు గడిచినా, పాలకులు, ప్రజా ప్రతినిధులు మారినా కాల్వ నిర్మాణం మాత్రం పూర్తి కాలేదని విమర్శించారు. గోదావరి జలాలు బునాదిగాని కాల్వ ద్వారా ఇచ్చేందుకు డీపీఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కాల్వ పూర్తి కోసం దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని, సెప్టెంబరులో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామన్నారు. ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేషం, మోత్కూరు, గుండాల మండలాల కార్యదర్శులు గుండు వెంకటనర్సు, మద్దెపురం రాజు, నాయకులు పైళ్ల యాదిరెడ్డి, కూరపాటి రాములు, దడిపెల్లి ప్రభాకర్, మెతుకు అంజయ్య, పిట్టల చంద్రయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో బోనాల సందడి





బీబీనగర్ మండలం జైనపల్లిలో, పోచంపల్లిలో మండలం దంతూరులో బోనాలు తీసుకెళుతున్న మహిళలు

బీబీనగర్, ఆగస్టు 17: మండలంలోని జైనపల్లి గ్రామంలో శనివారం గౌడ కులస్తులు , ముదిరాజు, గొల్లకురుమలు తమ ఆరాధ్య దైవాలు కంట మహేశ్వర స్వామి, పెద్దమ్మ తల్లి, బీరప్ప దేవతామూర్తులకు భక్తి శ్రద్ధలతో ఘనంగా బోనాలు తీశారు. గ్రామ దేవతల ఆలయాల వద్దకు ఊరేగింపుగా వెళ్లి భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ ఎం.బాలమల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు కంకరపల్లి అంజయ్య గౌడ్, బెజ్జంకి నరేందర్ రెడ్డి, పోచయ్య, గణేశ్, మధు గౌడ్, శ్రీనివాస్, రమేష్ ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని దంతూరు గ్రామంలో శనివారం కంఠమహేశ్వరస్వామి (కాటమయ్య) బోనాల ఉత్సవాలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలను ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి స్వామి వారికి నైవేద్యాన్ని సమర్పించారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు భక్తులను అలరించాయి. ఈ ఉత్సవాల్లో గౌడ సంఘం అధ్యక్షుడు సిద్ధగోని అంజయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ బత్తుల మాధవిశ్రీశైలంగౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షులు ఉడుతల బాలరాజుగౌడ్, ఎర్ర అశోక్‌గౌడ్, కొత్త బాలకిషన్‌గౌడ్, ఉడుతల మురళీగౌడ్, పందుల సత్తయ్యగౌడ్, మద్దెల కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

'బాధిత కుటుంబానికి అండగా ఉంటాం'

భువనగిరి రూరల్, ఆగస్టు 17: ఆపదలో ఉన్న రైతు కుటుంబాలను ఆదుకుంటామని చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మండడి లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని చందుపట్ల గ్రామ రైతు దంతూరి జంగయ్య (80) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.30వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు.

రైతుల ఖాతాల్లో రూ. 20.97 కోట్లు జమ

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 17: రూ.రెండు లక్షల రుణమాఫీకి సంబంధించి చౌటుప్పల్ మండలంలో 1627మంది రైతుల ఖాతాల్లో రూ.20.97 కోట్లు జమ అయ్యాయి. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, డీసీసీబీ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ లలో రైతులకు చెందిన ఖాతాలలో రెండు లక్షల రుణమాఫీ నిదులను ప్రభుత్వం జమ చేసింది. రుణమాఫీ జరిగిన విషయాన్ని తెలుసుకునేందుకు గాను బ్యాంకుల వద్ద రైతులు బారులు తీరి మాఫీ వివరాలను సేకరిస్తున్నారు.

'ధర్మ టీచర్స్ యూనియన్ సమావేశాన్ని విజయవంతం చేయాలి'

గుండాల, ఆగస్టు 17: ఈనెల 25వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్మ టీచర్స్ యూనియన్ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కో కన్వీనర్ మహేశ్ కోరారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం ధర్మ టీచర్స్ యూనియన్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సంఘం జిల్లా కన్వీనర్ ఎర్ర సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ మోహన్, ఉపాధ్యాయులు రవి, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి



ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మోటకొండూరు, ఆగస్టు 17: విద్యుత్ సరఫరా, సమస్యలపై విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఆలేరు ఏడీఈ సూర్య నాయక్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రైతులకు అందిస్తున్న నాణ్యమైన విద్యుత్ సరఫరా, లూజ్‌లైన్, పలు విద్యుత్ సమస్యలపై రైతులతో చర్చించారు. అనంతరం రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏడీఈకి వినతి పత్రం అందజేశారు. ఏఈ వినోద్ కుమార్, ఎల్‌ఐలు సాయిలు, వేణుగోపాల్, లైన్‌మెన్‌లు సత్తయ్య, రాములు, బాలరాజు, నర్సింహ పాల్గొన్నారు.

టీపీయూఎస్ మండల అధ్యక్షుడిగా వైవీఎన్.రెడ్డి

వలిగొండ, ఆగస్టు 17: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా వైవీఎన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా మద్దెపూరి వెంకటేశం ఎన్నికయ్యారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలి



డీఏవో లావణ్యకు వినతి పత్రం అందచేస్తున్న శ్రీరాములు

భువనగిరి రూరల్, ఆగస్టు 17: భువనగిరి శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద చిరు వ్యాపారులకు సంబంధించిన దుకాణాలను ధ్వంసం చేయడం సరి కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. ఇటీవల ఇండస్ట్రియల్ సిబ్బంది ఎల్లమ్మ దేవాలయం వద్ద చిరు వ్యాపారులు వేసుకున్న గుడిసెలను తొలగించిన స్థలాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భక్తుల కోసం సేవలందిస్తు కుమ్మరి కులస్తులు, బడుగు, బలహీన వర్గాలు జీవన భృతి పొందుతున్నారని వారి గుడిసెలను తొలగించడం సరికాదన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ డీఏవో లావణ్యకు వినతి పత్రం అందచేశారు. సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు ఏశాల అశోక్, నాయకులు సోమన సబిత, పుట్ట రమేశ్, దాసరి లక్ష్మయ్య, వెంకట్ రెడ్డి, బాధితులు తాడూరి ఎట్టమ్మ, బుజ్జమ్మ, వెంకటేశ్, బాలసత్తి ఉన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 17: చౌటుప్పల్ పట్టణంలోని మద్దెలమ్మ దేవాలయంలో శనివారం పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహంతో పాటు నవగ్రహాల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రాణ ప్రతిష్ఠ చేశారు. దిష్టి కుంభం, నేత్రోన్మలనం, ఈశాన బలి, క్షేత్రపాలక బలి, అలంకారం, మహా నైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు సుప్రభాతం, హోమం, పంచలోహాలు- నవరత్నాల నిక్షిప్తం చేశారు. కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ అధ్యక్షుడు గోశిక స్వామి, ప్రధాన కార్యదర్శి గోశిక రవి, మాజీ ప్రజా ప్రతినిధులు గోశిక కరుణాకర్, సుమతి, గుర్రం నర్సింహ, గోశిక బాలరాజ్, గోశిక ప్రభాకర్, జెల్ల రమేష్ పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు పెద్ది సుధాకర్‌శర్మ ఆధ్వర్యంలో పండితులు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఆదివారం మద్దెలమ్మ బోనాల జాతర నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు స్వామి, రవి తెలిపారు.

క్షేత్రస్థాయి పర్యటనలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు



భువనగిరికి చేరిన వ్యవసాయ విద్యార్థులు

భువనగిరి రూరల్, ఆగస్టు 17: కళాశాలలో చదివిన చదువును క్షేత్రస్థాయిలో పర్యటనలో రైతులతో మమేకమయ్యేందుకు భువనగిరికి 46మంది విద్యార్థులు వచ్చినట్లు ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేందర్ నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం వ్యవసాయ కళాశాల బీఎస్సీ నాలుగో సంవత్సరం చదువుతున్న 46మంది విద్యార్థినులు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నాలుగు నెలల పాటు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంటూ వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ విషయాలపై అవగాహన చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వారు రైతులకు చేరవేస్తారని, శాస్త్రవేత్త కె.మమత పర్యవేక్షణలో కొనసాగుతుందన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ నిర్మల, ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, అభ్యుదయ రైతు కంచి మల్లయ్య ఉన్నారు.

వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

భువనగిరి రూరల్, ఆగస్టు 17: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దెబ్బతీస్తోందని దీంతో వ్యవసాయ కార్మికులు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, కార్పొరేట్ కంపెనీలను ప్రోత్సహించడం తదితర రైతు వ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈనెల 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న వ్యకాస రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి, నాయకులు పెంటయ్య, సైదులు, అంజయ్య, జూకంటి పౌలు, సుర్పంగ స్వామి, మాలయ్య, ఎల్లయ్య, యాదగిరి పాల్గొన్నారు.